## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

- బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్స్, ద శ్రీరామ స్కూల్, గోల్ఫ్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్‌హిల్స్,
- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు హిల్‌రిడ్జ్ విల్లాస్, హిల్‌రిడ్జ్ అపార్ట్‌మెంట్స్, ఎల్లాహోటల్,
- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్కీ క్యాంపస్, జయభేరీ పైన్‌వ్యాలీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### ● చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ

సందర్శకులు తిలకించేందుకు ఉదయం 10.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు అవకాశం..
మొత్తం 7 గ్యాలరీలు.. ఒక గ్యాలరీ బుక్ చేసుకునేందుకు రూ.3500 (ఆర్టిస్టులకు)
బుక్ చేసుకోవాలనుకున్న వారు సంప్రదించాల్సిన ఫోన్.9100022957,9100022958

### చలివేంద్రం ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ పటేల్‌కుంట పార్కు ఎదురుగా ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం బీజేపీ రాష్ట్ర నేత రవికుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం శంషీగూడ, ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆర్‌కేవై ఫౌండేషన్ ద్వారా చలివేంద్రాలు, పేద విద్యార్థులకు బుక్స్ పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టి సమాజానికి సేవ చేసే అవకాశాన్ని కల్పించిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణిభూషణ్, నర్సింగ్‌రావు యాదవ్, నరసింహాచారి, భూపాల్‌రెడ్డి, శ్రావణి, పద్మ, నర్సింగ్‌రావు, నవీన్‌గౌడ్, గోపాల్‌రావు, సీతారామరాజు, సాయి, సురేష్, సందీప్, రమేష్, శ్రీలత రెడ్డి, దేవి రెడ్డి, జయశ్రీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

### 17 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

రాయదుర్గం: జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఆలయ యాగశాల ప్రదక్షిణం, భూత బలి, గణపతి పూజలు చేస్తారు. ఈ కార్యక్రమాల న్నీ ఉగాది పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆధ్వర్యంలో జరగనున్నాయి.

### గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023–2024 విద్యా సంవత్సరం, 5వ తరగతి ప్రవేశానికి ఈ నెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలని చిట్కుల్ గురుకుల ప్రిన్సిపల్ ప్రమోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...4వ తరగతి చదివిన విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు.

### చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

పటాన్‌చెరు టౌన్: కార్మిక రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో పార్లే ఆగ్రో పరిశ్రమ కార్మికుల సమావేశానికి హాజరై కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం కార్మిక, ప్రజా, కర్షక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ గౌడ్, రాజశేఖర్, కిరణ్, శ్రీకాంత్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తాం

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో భాగంగా ఆల్విన్‌కాలనీ ఫేజ్–1లో మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ ఫేజ్–1లో వాటర్‌ట్యాంకర్ ఎదురుగా ఉన్న వీధిలో డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని త్వరలో సీసీ రోడ్డు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా కొన్ని వీధుల్లో డ్రైనేజీ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవి పూర్తి చేసిన అనంతరం రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఏఈ శివప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, నాయకులు వెంకటేష్‌గౌడ్, సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

# మెట్లకుంట.. మెరిసేనా


గోపన్‌పల్లిలోని మెట్లకుంట చెరువు

### చెరువు సుందరీకరణ చేపట్టాలి

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని చారిత్రక రంగనాథ స్వామి ఆలయం ముందున్న పురాతన మెట్లకుంట చెరువును సుందరీకరించాలని స్థానికులు కోరుతున్నారు. అధికార యంత్రాంగం గతంలోనే సరిహద్దులు గుర్తించి ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. కానీ పూర్తి స్థాయిలో సుందరీకరించలేకపోయారు. దీంట్లో ప్రతియేటా పిచ్చి మొక్కలు , చుట్టూరా చెత్తాచెదారంతో కనిపించేది. ఈ క్రమంలో ప్రతి ఆదివారం క్లీనప్ డ్రైవ్ చేపట్టడంతో శుభ్రత నెలకొంది. దీన్ని అభివృద్ధి చేస్తే చుట్టుపక్కలవాసులు సేదతీరుతారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

#### చుట్టూరా గేటెడ్ కమ్యూనిటీలున్నా పార్కులు సున్నా..

- గోపన్‌పల్లి చుట్టూ పలు గేటెడ్ కమ్యూనిటీలు వెలిశాయి. అపర్ణా సరోవర్, అపర్ణ గ్రాండే, డైమండ్ హైట్స్, అపర్ణా సైబర్ కౌంటితోపాటు పలు గేటెడ్ కమ్యూనిటీల ఏర్పాటుతో వేలాది మంది నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో మెట్లకుంట పరిసరాల్లో ఆహ్లాదం పొందవచ్చు. అందుబాటులో జీహెచ్‌ఎంసీ పార్కులు లేకపోవడంతో స్థానికులు సేద తీరే ప్రాంతాలే లేకుండా పోయాయి.
- మెట్లకుంట చుట్టూరా వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు.
- గ్రీనరీ, పూలమొక్కల పెంపకం.
- లైటింగ్ ఏర్పాటు, చెరువులో ఫౌంటేన్ ఏర్పాటు చేస్తే ఆకర్షణీయంగా కనిపిస్తుంది.
- పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక స్థలం, యోగా, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేలా మినీ ఓపెన్ ఆడిటోరియం వంటిది కూడా అందుబాటులోకి తెస్తే సెలవు రోజుల్లో చిన్నచిన్న కార్యక్రమాలు ఏర్పాటుకు అవకాశం

#### అప్పట్లో సుందరీకరణ.. రోడ్డు విస్తరణలో తొలగింపు..

- ఐదేళ్ల క్రితం గోపన్‌పల్లిలోని మెట్లకుంటను సుందరీకరించాలనే ఉద్దేశంతో మొదట ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.
- అనంతరం రోడ్డువైపున వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఆ తర్వాత రోడ్డు విస్తరణకు పనులు ప్రారంభించడంతో ఈ ట్రాక్‌లను, ఫెన్సింగ్‌ను కూడా తొలగించేశారు.
- మెట్లకుంట పరిసరాలను శుభ్రం చేయాలనే తపనతో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి క్లీనప్ డ్రైవ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.
- ప్రతి ఆదివారం గోపన్‌పల్లి, చుట్టూరా కాలనీవాసులు, గేటెడ్ కమ్యూనిటీ వారితో కలిసి స్వయంగా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొనగా ఇందులో మహిళలు కూడా ముందుకొచ్చి శుభ్రం చేశారు.
- పరిసరాలు శుభ్రంగా మారిపోయాయి. ఆ తర్వాత ఈ కార్యక్రమం నిలిచిపోయింది.

#### ఆహ్లాదకరంగా మారుస్తాం..



గోపన్‌పల్లిలోని మెట్లకుంటను ఆహ్లాదకర ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. దీనికోసం అధికారులతో కూడా మాట్లాడాం. వారు కూడా సంసిద్ధత వ్యక్తం చేశారు. త్వరలో సుందరీకరణ పనులు చేపడతాం. మల్కంచెరువు, ఖాజాగూడ పెద్ద చెరువు తరహాలో మరో 3 చెరువుల అభివృద్ధి పనులు చేపట్టాం. ఈ ప్రాంతాన్ని మారుస్తాం.
–గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్ గచ్చిబౌలి

## చెరువుల సుందరీకరణకు కృషి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రధాన చెరువుల సుందరీకరణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బండ్లగూడ, దోషం చెరువు పరిధిలో రూ.కోటి 50లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు మంగళవారం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్‌లతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మక్క చెరువు, సాకి చెరువు, దోషం చెరువు, రామచంద్రాపురంలోని రాయసముద్రం చెరువుల సుందరీకరణకు నిధులు కేటాయించారన్నారు. దోషం చెరువుకట్టపై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, బండ్లగూడ అధ్యక్షుడు గోపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

## దుర్గం చెరువు వద్ద బోట్లు ఇవే..

పెడల్ బోటింగ్, స్పీడ్ బోటింగ్,డీలక్స్ బోటింగ్, రెస్టారెంట్ బోటింగ్

1. పెడల్ బోటింగ్ వ్యక్తికి రూ.50. నలుగురు రైడ్ చేసేందుకు వీలుగా ఉంటుంది. రైడ్ సమయం 30 నిమిషాలు.
2. స్పీడ్ బోటింగ్ వ్యక్తికి రూ.100. బోట్‌లో నలుగురు ప్రయాణించవచ్చు. సమయం 6 నిమిషాలు.
3. డీలక్స్ బోటింగ్, వ్యక్తికి రూ.50.ఇందులో 20 మంది కూర్చునే అవకాశం ఉంటుంది. సమయం 10 నిమిషాలు
4. రెస్టారెంట్ బోటింగ్ వ్యక్తికి రూ.200.ఇందులో 30 మంది కూర్చోవడానికి వీలుగా ఉంటుంది. సమయం 30 నిమిషాలు, సాయంత్రం సమయంలో స్నాక్స్ అందిస్తారు.

**బర్త్‌డేలకు ప్రత్యేకం..**
దుర్గం చెరువు వద్ద ప్రత్యేక ప్రాంతాలను ఏర్పాటు చేశారు. బర్త్‌డేలు, చిన్నచిన్న కార్యక్రమాలను చేసుకోవచ్చు.

**దుర్గం చెరువు లేక్ : ఛార్జీలు**
ప్రవేశం ఫీజు వ్యక్తికి: రూ.10
పిల్లలకు: రూ.5
నెలసరి వాకర్స్ పాస్: రూ.200
సంవత్సర వాకర్స్ పాస్: రూ. 2000
సీనియర్ సిటిజన్స్ వాకర్స్ పాస్: రూ. 800
స్టిల్ కెమెరా ఫొటోషూట్: రూ. 250, (పర్ డే)
వీడియో కెమెరా షూటింగ్: రూ.5000 (పర్‌డే)
ఫిల్మ్ షూటింగ్: రూ. 25,000 (పర్‌డే)

## క్రీడలతో మానసికోల్లాసం

పటాన్‌చెరు: క్రీడలతో శారీరక ధారుడ్యంతో పాటు, మానసికోల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామేశ్వరం బండ వీకర్ సెక్షన్ కాలనీలో జీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపునకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీరంగూడ జట్టుకు రూ.50వేలు, పటాన్‌చెరు జట్టుకు రూ.25వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అంతిరెడ్డి, బండి శంకర్ పాల్గొన్నారు.

## కారు కింద పడి చిన్నారి మృతి

గచ్చిబౌలి: కారు వెనుక చక్రాల కింద పడి ఓ చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దంపతులు రాకేష్‌యాదవ్– లక్ష్మీ యాదవ్ బతుకుదెరువుకు వలస వచ్చి రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా చిన్నారి భూమి(3)ని తీసుకొని పెద్దనాన్న తిలక్ ఆదివారం రాత్రి 7.15 గంటలకు రాఘవేంద్ర కాలనీలో మార్కెట్‌కు వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న తిలక్ తూలి చిన్నారి మీద పడటంతో అటుగా వస్తున్న కారు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే భూమి మృతి చెందింది. సీసీ పుటేజీ ఆధారంగా కారును గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భర్త వేధింపులు తాళలేక..

మియాపూర్: భర్త వేధింపులు తాళలేక ఓ భార్య ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లిలోని సిటిజన్ కాలనీకి చెందిన ఇషాక్‌సాబ్ భగవాన్ స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కూతురు సనా(22) వివాహం ఆదిత్యనగర్‌కు చెందిన కరీమ్‌తో 17 నెలల క్రితం జరిపించారు. పెళ్లయిన రెండు నెలల పాటు బాగానే చూసుకున్నాడు. ఆ తర్వాత భార్యను కొట్టడం, తిట్టడం, మరో పెళ్లి చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. పలుమార్లు ఇలా జరగడంతో సనా పుట్టింటికి వెళ్లింది. తల్లిదండ్రులు కూతురు, అల్లుడికి సర్దిచెప్పి పంపించారు. అయిన వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక సనా మంగళవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరివేసుకుంది.తండ్రి ఇషాక్‌సాబ్ భగవాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రైనేజీ ఇబ్బందులు లేకుండా చూస్తాం


అల్లాపూర్ సొసైటీ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అల్లాపూర్ సొసైటీ కాలనీలో పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది, జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మంగళవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారులతో పరిశీలించామని, త్వరగా పనులు చేపట్టి ఏ ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్‌వైజర్ నరేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సంగమేశ్వరరావు, శివ రెడ్డి, రావూరి శ్రీనివాస్, రమేష్, సుబ్బారాయుడు, సత్యనారాయణ, మధు, నిరంజన్ ఉన్నారు.

## నిధులు మంజూరు చేయండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పునర్‌నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ దాన కిషోర్‌కు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు.


దానకిషోర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్

## స్వయం పరిపాలన దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. విద్యాశాఖ మంత్రిగా సూర్యకుమారి, కలెక్టర్‌గా రాజేశ్వరి, డీఈఓగా పావని, ఎంఈఓగా ప్రేమలత, ప్రధానోపాధ్యాయులుగా కీర్తన, ఉపాధ్యాయులుగా రేవంత్, సందీప్, దుర్గాప్రసాద్, నవీన్‌లు వ్యవహరించారు.



## మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 34 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 31 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు, మరో ముగ్గురికి రూ.3 వేల జరిమానా విధించారు.

## సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

**గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి**

రాయదుర్గం: కాలనీల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితండాలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, మురుగునీటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో తరచూ అనారోగ్యంపాలు కావాల్సి వస్తోందని వాపోయారు. మంచినీటి పైప్‌లైన్‌లు కొత్తవాటిని ఏర్పాటు చేయాలని జలమండలి డీజీఎం నారాయణను ఆయన ఫోన్ ద్వారా కోరారు. గోపన్‌పల్లి తండాలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నారాయణ, మేనేజర్ అభిషేక్‌రెడ్డి, నాయకులు హన్మంతునాయక్, తిరుపతి, శేఖర్, ప్రభాకర్, వేణు, నర్సింహ్మా, హెచ్‌ఎండబ్ల్యూ వర్క్‌ఇన్‌స్పెక్టర్ మోహన్, కాలనీవాసులు పాల్గొన్నారు.


గోపన్‌పల్లితండాలో పర్యటించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

## షీటీమ్ సేవలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్: మహిళలకు అండగా షీటీమ్ ఉందని పటాన్‌చెరు నియోజకవర్గ షీటీమ్ ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు షీటీమ్, సైబర్ నేరాల్లో మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బస్టాండ్, కళాశాలలు, స్కూళ్ల వద్ద మఫ్టీలో షీటీమ్స్ తిరుగుతున్నాయన్నారు. ఆకతాయిలు వెంటపడి వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తిస్తే డయల్ 100కు లేదా 7901148896కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

## 'మనూ-సూడాన్' ఒప్పందం

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంతో సూడాన్ వైట్‌నైల్ యూనివర్సిటీ మధ్య మంగళవారం ఒప్పందం కుదిరింది. పరస్పర ప్రయోజనకరమైన విద్య, పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను బలోపేతం చేయడానికి, ప్రోత్సహించడానికి కుదుర్చుకున్న ఈ ఒప్పందం అయిదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఉమ్మడి పర్యవేక్షణ, జాయింట్ రీసెర్చ్ ప్రాజెక్టులు, కాన్ఫరెన్స్‌లు, ఉమ్మడి అధ్యయన కోర్సులను ప్రోత్సహించడం, బోధన, పరిశోధన కార్యకలాపాలకు సంబంధించిన అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడికి రెండు విశ్వవిద్యాలయాలు అంగీకరించాయి.


ఒప్పందం కుదుర్చుకున్న యూనివర్సిటీల ప్రతినిధులు

## ఆయా అనుమతులపై సైబరాబాద్ సీపీ సమీక్ష



రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ అడ్మిన్ సమీక్ష మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయుధాల లైసెన్స్, సినిమాటోగ్రఫీ అనుమతి, బ్లాస్టింగ్ పర్మిషన్, స్కూల్, పెట్రోలియం, షూటింగ్ అనుమతులను సంబంధించి సిబ్బంది విధివిధానాలపై సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడారు. ఆయా పరిమ్రషన్ల విచారణకు ఇన్‌స్పెక్టర్లు వెళ్లాలంటే రోజువారీ విధులు కేసుల దర్యాప్తునకు ఆటంకం కలుగుతోందని, ఏసీపీ స్థాయి అధికారులకు అడ్మినిస్ట్రేటివ్ పవర్స్ ఇవ్వడం ద్వారా తొందరగా ప్రాసెస్ అవ్వడంతోపాటు త్వరితగతిన పర్మిషన్లు ఇవ్వడం సాధ్యం అవుతుందన్నారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ప్రతి పరీక్ష కేంద్రం పరిధిలో పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పుడు ప్రశాంతంగా పరీక్షలు సాగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## తృణధాన్యాలపై అవగాహన పోటీలు


తృణధాన్యాల గురించి వివరిస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తృణధాన్యాల ప్రాసెసింగ్, పరికరాలు, యంత్రాలు, ప్యాకేజింగ్ వంటి అంశాల్లో వాల్ పోస్టర్ల రూపకల్పనపై పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరం – 2023లో భాగంగా ఈ పోటీలు జరిగాయి. కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చరిత్‌కుమార్ విజేతలను ఎంపిక చేశారు. ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 16, 17 తేదీల్లో హవానా – 2.0 పేరుతో ఇంజినీరింగ్ విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్టు విభాగాధిపతి ప్రొఫెసర్ మాధని తెలిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాల కోసం 93484 55589 నంబరులో సంప్రదించాలన్నారు.

## స్విగ్గీ డెలివరీ బాయ్‌పై దాడి

**ఎన్‌సీసీ నాగార్జునలో ఘటన**

గచ్చిబౌలి: ఓ స్విగ్గీ డెలివరీ బాయ్‌పై సెక్యూరిటీ గార్డులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డ ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 8.58 గంటల సమయంలో స్విగ్గీ డెలివరీ బాయ్ శాంతకుమార్ గచ్చిబౌలిలోని ఎన్‌సీసీ నాగార్జున రెసిడెన్సీ గేటెడ్ కమ్యూనిటీలో ఫుడ్ డెలివరీకి వెళ్లాడు. తిరిగి వస్తుండగా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులు ఆపి నువ్వు ఏ లిఫ్ట్‌లో వెళ్లావని అడగ్గా, స్విగ్గీ బాయ్ సర్వీస్ లిఫ్ట్‌లో వెళ్లానని చెప్పగా, లేదు నువ్వు మెయిన్ లిఫ్ట్‌లో వెళ్లావంటూ గొడవకు దిగారు. ఆరుగురు సెక్యూరిటీ గార్డులు దాడి చేయగా, గాయపడిన శాంతకుమార్ అక్కడి నుంచి తప్పించుకొని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన ముగ్గురు సెక్యూరిటీ గార్డులను అరెస్ట్ చేశారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు.